


ఆశావాహులకు చోటు

- వివాదాస్పద స్థానాలకు బ్రేక్
- చిత్తూరులో 5, తిరుపతిలో 2
- టిడిపి తొలిజాబితా ప్రకటన


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపిలో ఆశావాహులకు చోటు దక్కింది.. వివాదాస్పద స్థానాలకు బ్రేక్ పడింది. జనసేన, టిడిపి ఉమ్మడి పొత్తుతో సార్వత్రిక ఎన్నికల్లో ముందుకెళుతోంది. విజయవాడలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ప్రకటించిన తొలి జాబితాలో చిత్తూరు జిల్లాలో ఐదుగురిని, తిరుపతిలో ఇద్దరిని ఖరారు చేశారు. చిత్తూరులో గురజాల జగన్మోహన్, నగిరి గాలి భానుప్రకాష్, జీడీనెల్లూరు డాక్టర్ థామస్, పలమనేరు అమరనాథరెడ్డి, కుప్పం నారా చంద్రబాబునాయుడు బరిలో ఉండనున్నారు. చిత్తూరులో పూతలపట్టు, పుంగనూరు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. పుంగనూరులో టిడిపి తరపున చల్లా రామచంద్రారెడ్డి పోటీలోఉన్నప్పటికీ కొత్తగా పార్టీ పెట్టిన రామచంద్రయాదవ్ పొత్తులో భాగంగా పుంగనూరు అడుగుతున్నట్లు సమాచారం. పూతలపట్టులో జరిగిన బహిరంగసభలో కలికిరి మురళీమోహన్‌ను ఆదరించాలని పిలుపున్నిచ్చినా తొలి జాబితాలో పేరు లేకపోవడం గమనార్హం.


తిరుపతి జిల్లాలో గూడూరు పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట నెలవల విజయశ్రీలను ప్రకటించారు. సత్యవేడు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో అభ్యర్థులకు ఇంకా ప్రకటించలేదు. తిరుపతి జనసేనతో పొత్తులో భాగంగానే పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. చంద్రగిరి, సత్యవేడులో అనిశ్చిత పరిస్థితి ఉంది. శ్రీకాళహస్తిలోనూ జనసేన అభ్యర్థి పట్టుబడుతున్నట్లు సమాచారం. వెంకటగిరిలో ఎస్వీవీ నాయుడు పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.



నారా చంద్రబాబునాయుడు: చంద్రగిరి మండలం నారావారిపల్లి వాస్తవ్యుడు. ఎస్వీయూలో ఎంఎ ఎకనామిక్స్ పూర్తి చేశారు. 1978లో ఇందిరా కాంగ్రెస్‌లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి మంత్రి అయ్యారు. ఆ తరువాత 1983లో టిడిపి నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 1985లో కుప్పంకు రాజకీయ వలస వెళ్లారు. అప్పటినుంచి అదే నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగానూ గెలుపొందుతూనే ఉన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా, 14 ప్రతిపక్షనాయకునిగా ఉన్నారు.




ఎన్.అమరనాథరెడ్డి : మాజీ ఎంపి నూతనకాల్వ రామకృష్ణారెడ్డి తనయుడు అమరనాథరెడ్డి. పెద్దపంజాణి మండలం కెళవాతిలో సర్పంచిగా రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. డిగ్రీ చదివారు. 1996లో పుంగనూరులో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా పలమనేరుకు వలసొచ్చారు. వైసిపిలో చేరి అక్కడ ఇమడలేక తిరిగి 2017లో టిడిపిలోకి వచ్చేశారు. 2019 వరకూ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు.



గురజాల జగన్మోహన్ : చిత్తూరు నియోజకవర్గం గుడిపాల మండలం. రియల్ ఎస్టేట్‌లోనూ, పారిశ్రామికంగానూ బెంగుళూరులో స్థిరపడ్డారు. డిగ్రీ చదివారు. జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ స్థాపించి 700 మంది పేద పిల్లల్ని చదివించారు. హెల్త్ క్యాంపులు పెట్టారు. టిడిపిలో చురుగ్గా ఉండి చిత్తూరు నుంచి బరిలో దిగేందుకు సమాయత్తమయ్యారు.



డాక్టర్ థామస్ : కార్వేటినగరం మండలం అల్లాగుంట సొంతూరు. ఎస్వీ మెడికల్ కాలేజీలో చదివి డాక్టర్ అయ్యారు. చెన్నయ్‌లో డాక్టర్‌గా సెటిలయ్యారు. టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్ ద్వారా సుపరిచితులు. జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి నూతన అభ్యర్థిగా పోటీలో దిగుతున్నారు. గతంలో గుమ్మడి కుతూహలమ్మ కొడుకు హరికృష్ణ పోటీ చేసి ఓడిపోయారు.



గాలి భానుప్రకాష్ : తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు వారసునిగా సుపరిచితులు. డిగ్రీ చదివారు. 2019 ఎన్నికల్లో నగరి నుంచి పోటీ చేసి రోజా చేతిలో8వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ టిడిపి అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు.



పాశం సునీల్‌కుమార్ : గూడూరు పట్టణవాసి. ఇటీవలే పిహెచ్‌డి తీసుకున్నారు. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అప్పట్లో 23 మంది వైసిపి నుంచి ఫిరాయింపుదారులుగా టిడిపిలోకి వచ్చారు. అందులో ఆయన ఒకరు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వరప్రసాద్‌పై పోటీచేసి ఓడిపోయారు. మళ్లీ తిరిగి ఆయనే బరిలో దిగనున్నారు.



నెలవల విజయశ్రీ : ఆమె తండ్రి మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం పెద్ద కుమార్తె. డాక్టర్ చదివారు. ప్రస్తుతం నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో సీనియర్ డాక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుతం నాయుడుపేటలో నివాసం ఉంటున్నారు. తండ్రి వయస్సు సహకరించకపోవడంతో కుమార్తెకు అవకాశం ఇచ్చారు. టిడిపి అభ్యర్థిగా సూళ్లూరుపేట నుంచి పోటీ చేయనున్నారు. 40 ఏళ్ల తరువాత మళ్లీ ఓ మహిళ రిజర్వు స్థానం నుంచి బరిలో దిగనున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం

కుప్పంకు హంద్రీ నీవా : పెద్దిరెడ్డి

- 26న జిల్లాకు ముఖ్యమంత్రి రాక
- హంద్రీ నీవా కాలువ పనులను పరిశీలించిన మంత్రులు
- పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 26వ తేదీ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి కుప్పం నియోజకవర్గం శాంతిపురం, రామకుప్పం మండలాలలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతున్నదని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామితో కలసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శాంతిపురం మండలం, గుండిశెట్టిపల్లి బహిరంగ సభ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను, రామకుప్పం మండలం రాజుపేట వద్ద శరవేగంగా జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో కుప్పం పర్యటనలో ఇచ్చిన మాట ప్రకారం నీటిని కుప్పం నియోజకవర్గానికి నీరు అందించడంలో భాగంగా హంద్రీ- నీవా కాలువ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కాలువ ద్వారా కుప్పం నియోజకవర్గంలో దాదాపు 54 చెరువులకు నీరు అందించే పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చెలా రామకుప్పంలో పూజా కార్యక్రమం నిర్వహించి హంద్రీ-నీవా నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. పాలారు ప్రాజెక్టు కూడా శంఖుస్థాపన చేయడం జరుగుతుందని, ఈప్రాజెక్టు పూర్తి అయినట్లైతే హంద్రీ-నీవా, పాలారు ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని తెలిపారు. గాండ్ల కమ్యూనిటి భవననిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించి రూ.3కోట్లు నిధులు విడుదల చేసి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. వారి వెంట జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, రాష్ట్ర జానపద కళలు కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, డిసిసిబి చైర్మన్ రెడ్డెమ్మ, కుప్పం పలమనేరు ఆర్డీవోలు శ్రీనివాసులు, మనోజ్ రెడ్డి, రామకుప్పం ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్ రాఘవరెడ్డి, తహశీల్దారు శ్రీధర్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్ రెడ్డి, బాబురెడ్డి, చంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

26న జిల్లాకు సిఎం రాక

చిత్తూరుఅర్బన్: కుప్పం నియోజకవర్గంలో ఒక రోజు పర్యటన నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈనెల 26వ తేదీ సోమవారం జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి 26 ఉదయం 10.25 గంటలకు రామకుప్పంలోని రాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని స్థానిక ప్రజాప్రతినిధులతో భేటీ అనంతరం 10.40 గంటలకు హంద్రీ-నీవా నీటి విడుదల చేసే ప్రదేశానికి చేరుకుంటారన్నారు. కొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హెచ్ఎన్ఎస్ఎస్ నీటి విడుదల, శిలాఫలకం ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం 11.15 గంటలకు శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని 11.25 గంటలకు బహిరంగ సభకు చేరుకుంటారన్నారు. బహిరంగ సభ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన లబ్ధిదారులతో ముఖాముఖీ, ప్రజాలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. బహిరంగ సభ అనంతరం మధ్యాహ్నం 1.15గంటలకు గుండిశెట్టిపల్లి హెలిప్యాడ్ చేరుకుని స్థానిక ప్రజాప్రతినిధులతో భేటీ అయి 2.20 గంటలకు రేణిగుంట బయలుదేరి వెళ్లనున్నారని తెలిపారు.

డిసిసి బ్యాంకు, ఆర్‌బికెలు ప్రారంభం

రామకుప్పం: మండలంలో రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రంను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. దీనితో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రామకుప్పం శాఖను ఎంపి రెడ్డెప్పతో కలిసి మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఈనెల 26న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మండలంలోని రాజుపేట వద్ద హంద్రీ- నీవా జలాలకు పూజా కార్యక్రమాలు చేపట్టనున్న నేపథ్యంలో అక్కడి కాలువ పనులను, హెలిప్యాడ్ ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు అందించారు.



హంద్రీ నీవా కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రులు

అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆధునిక సేవలు

- అందుబాటులో సీబీసీ, ఎలక్ట్రోలైట్ లాంటి అత్యాధునిక మెషిన్లు,
- రూ.300 నుంచి రూ.1000కి పైగా ఖర్చయ్యే అయ్యే పరీక్షలు ఉచితం
- నేడు 62 రకాల పరీక్షలు నిర్వహణ







ప్రజాశక్తి- నగరి

మునిసిపల్ పరిధిలో రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ సెంటర్లు అత్యాధునిక వైద్యాన్ని అందిస్తోంది. ఈ సెంటర్ల వద్ద ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఆపరేటర్, ఒక అటెండర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలను అందిస్తున్నారు. పిల్లలకు అన్ని రకాల వ్యాక్సిన్లు ఈ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయి.

62 రకాల పరీక్షలు నిర్వహణ

అర్బన్ సెంటర్‌లోని ల్యాబ్‌లలో 62 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ టెస్టులు, ప్లేట్‌లెట్స్ కౌంటింగ్ టెస్టు, కిడ్నీ సంబంధిత టెస్టు, యూరిన్, సోడియం, పోటాషియం టెస్టులు, డయాబెటీస్, హైపర్‌టెన్షన్ ఉండేవారికి లిక్విడ్ ప్రొఫైల్ టెస్టులు, స్పుటమ్ టెస్ట్ అంటూ 62 రకాల పరీక్షలు ఈ సెంటర్లలో నిర్వహిస్తున్నారు. వాటికి సంబంధిత కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులలో సైతం లేని టెస్టింగ్ మెషిన్లు కార్పొరేట్ ఆస్పత్రులలో మాత్రమే అందుబాటులో ఉండే సీబీసీ మెషిన్లు, ఎలక్ట్రోలైట్ మెషిన్లు, బయోకెమిస్ట్రీ అనలైజర్, యూరిన్ అనాలసిస్ మెషిన్ లాంటి అత్యాధునిక టెస్టింగ్ మెషిన్లు, బ్లడ్ టెస్టింగ్ మెషిన్లు అర్బన్ హెల్త్‌సెంటర్లలో అందుబాటులో ఉన్నాయి. ఈ పరీక్షలు బయట చేసుకోవాలంటే ఎలక్ట్రోలైట్ సోడియం, పొటాషియం టెస్టు రూ.1000, లిక్విడ్ ప్రొఫైల్ టెస్టుకు రూ.600, యూరిన్ టెస్టు రూ.200, డెంగ్యూ టెస్టు రూ.600, టైఫాయిడ్ రూ.300, మలేరియా రూ.300 అంటూ చెల్లించాల్సి ఉంది. ఈ పరీక్షలన్నీ రోగులకు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉచితంగా చేస్తున్నారు





సేవలను ప్రజలు వినియోగించుకోవాలి
- డాక్టర్ రవిరాజు, డీఐఓ, చిత్తూరు

కార్పొరేట్ ఆస్పత్రులలో మాత్రమే ఉండే అత్యాధునిక టెస్టింగ్ మెషిన్లు డాక్టర్ వైస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉన్నాయి. నైపుణ్యం కలిగిన ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్యులు ఉన్నారు. వేలకు వేలు పెట్టి చేసుకునే పరీక్షలన్నీ ఉచితంగా చేయడం జరుగుతుంది. పరీక్షలకు సంబంధిత కిట్లు కూడా అర్బన్ సెంటర్లలో పుష్కలంగా ఉన్నాయి. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

చిత్తూరులో

దిగ్గజాల మధ్య పోటీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో ఇద్దరు దిగ్గజాల మధ్య పోటీ నెలకొంది. చిత్తూరు నియోజకవర్గంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిల మధ్య ప్రధానంగా పోటీ ఉండనుంది. చిత్తూరు నియోజకవర్గంలో బలిజ సామాజివర్గానికి చెందిన ఆరణి శ్రీనివాసులు వైసీపీ తరపున ఎమ్మెల్యేగా ప్రాతినిధ్య వహిస్తున్నారు. మరోమారు ఎమ్మెల్యే సీటు కోసం ఆరని ప్రయత్నాలు ముమ్మరంగా సాగించారు. అయినప్పటికీ సామాజిక సమీకరణల నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త విజయానందరెడ్డిని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఖరారు చేశారు. విజయానంద రెడ్డి చిత్తూరు నియోజకవర్గంలో తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునేందుకు విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే తనసొంత నిధులు కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గంలో పలు రకాల సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టి కొనసాగిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలుపు సాధించాలని ఆయన ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కూడా నియోజకవర్గంలో సమవుజ్జి అయిన ప్రముఖ పారిశ్రామికవేత్త వ్యాపారవేత్త, జీజేయం ట్రస్ట్ చైర్మన్ గురజాల జగన్మోహన్‌ను ఆచితూచి టిడిపి అభ్యర్థిగా ఎంపిక చేస్తూ అధిష్టానం శనివారం ప్రకటించింది. గురజాల జగన్మోహన్ కూడా గత కొంతకాలంగా నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి పలు రకాల సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా రాజకీయాలకతీతంగా తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో భారీ ఎత్తున ఖర్చు చేసేందుకు వైసిపి అభ్యర్థి విజయానంద రెడ్డి, టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్‌లో ఆర్థిక బలం కలిగి ఉండడంతో నియోజకవర్గంలో పోటీ రసవత్తరంగా సాగనుంది. ప్రతిపక్షం టిడిపి తరపున పలువురు అభ్యర్థులు ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పటికీ అధిష్టానం గురజాల జగన్మోహన్ వైపు మొగ్గుచూపుతూ ఆయన్ని అభ్యర్థిగా ఖరారు చేసింది. దీనితో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలు జిల్లాలోని ప్రత్యేకంగా నిలువనున్నాయి. ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో, జయాపజయాలు ఎవరిని వరిస్తాయో వేచి చూడాలి..



టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్



వైసిపి అభ్యర్థి విజయానంద రెడ్డి

ప్రారంభోత్సవానికి ఇంకెంతకాలం..?

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుంద్రం గ్రామంలో ఉన్న నూతన గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బికె కేంద్రాలు పూర్తయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. పాత గ్రామపంచాయతీ భవనంలో ఇరుకుగా ఉన్నప్పటికీ దానినే సచివాలయ కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారు. అలాగే ఆర్బికే కేంద్రం పూర్తయినప్పటికీ తూగుంద్రం గల పాల డెయిరీ కేంద్రంలో ఒక చిన్న గదిలో ఆర్‌బికే కేంద్రంగా ఉపయోగించుకుంటున్నారు. నూతన గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బికె కేంద్రాలు పూర్తయినప్పటికీ ఎందుకు ప్రారంభించి ఉపయోగించుకోవడం లేదంటూ పంచాయతీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన కొత్త భవనాల్లో కాకుండా ఇరుకు గదుల్లోనే సచివాలయం, ఆర్‌బికెలు నిర్వహించడంపై పలు విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధలు స్పందించి లక్షలు ఖర్చు పెట్టిన నిర్మించిన నూతన భవనాలను వినియోగం తేవాలని ప్రజలు కోరుతున్నారు.



పారంభం కానీ తూగుండ్రం కొత్త గ్రామ సచివాలయం భవనం




ప్రస్తుతం తూగుండ్రం వాడుకలో ఉన్న గామ సచివాలయ భవనం

ఎన్నికలకు యంత్రాంగం సంసిద్ధం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు, రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ సిబ్బందిని సమాయత్వం చేసుకుంటున్నారు. చిత్తూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థులు, చిత్తూరు నియోజవర్గ పార్లమెంట్ అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఎన్నిక నోటిఫికేషన్ వచ్చే నెల రెండో వారంలో విడుదలకానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాగాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న లెక్కల ప్రకారం జిల్లాలో 15,54,712 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్లు 7,65,903, మహిళా ఓటర్లు 7,88,725 మంది ఉన్నారు. ప్రతి నియోజక వర్గంలోనూ పురుష ఓటర్ల కన్నా మహిలా ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, అంగన్వాడీలను ఎన్నికల విధుల్లోకి తీసుకోనున్నారు. ఇప్పటికే ఎన్నికల విధులకు హాజరుకావల్సి ఉంటుందని ఉపాధ్యాయులు జిల్లా ఎన్నికల అధికారి నుండీ ఆదేశాలు పంపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనలేకపోతున్న ఉపాధ్యాయు సహేతుకమైన కారణాలు చూపాల్సి వుంటుంది. ఆనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు జిల్లా రెవెన్యూ అధికారిని కలిశారు. గర్భిణీలు, బాలింతలు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలను కూడా ఎన్నికల విధుల్లో వినియోగించుకోనున్నారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుండీ అంగన్వాడీల జాబితాను జిల్లా ఎన్నికల అధికారులు సేకరించారు. జిల్లా కేంద్రంలోని గోడౌన్‌లోని ఈవిఎంలను తనిఖీ చేసి పనితీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఈవిఎం మోరాయిస్తే వెంటనే మరమ్మతులు చేసేందుకు సాంతికేతి నిపుణులను ఏర్పాటు చేయడతో మరో ఈవిఎంను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



రాష్ట్రంలో జరగబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల వేళ సరిహద్దు ప్రాంతాలలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు పోలీస్‌శాఖ చెపడుతోంది. అక్రమమద్యం రవాణాను అరికట్టి అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో నిఘా పెంచనున్నారు. వాహనాల తనిఖీలు, ఎక్సైజ్ డిపార్టుమెంటుతో కలసి అక్రమ మద్యం కట్టడికి దాడులు నిర్వహించేందుకు పోలీస్‌శాఖ ప్రాణాళిక సిద్ధం చేస్తోంది. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు స్టేషన్‌ల పరిధిలో అంతరాష్ట్ర సరిహద్దులు, జిల్లాల వివిధ ప్రాంతాల్లో ఉన్న చెక్ పోస్టులను నిరంతరం పర్యవేక్షించనున్నారు. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. అక్రమ మద్యం, నాటు సారాపై ఉక్కుపాదం మోపి కేసుల్లో అరెస్టు కాని నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. రౌడీ షీటర్లను బౌండోవర్ చేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీస్‌శాఖ ఎన్నికల ముందు నుంచే నిఘా పెంచింది.

రాజకీయ పార్టీల నాయకులకు

ఈవీఎంల పని తీరుపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అసెంబ్లీ, పార్లమెంటు, సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలను కేటాయించుటకు జాతీయ, రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ట్రైయిల్ ఈవీఎంల మొదటి రాండమైజేషన్‌పై అవగాహన నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ సమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు రాండమైజేషన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు, సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలను కేటాయించుటకు జాతీయ, రాష్ట్రంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ట్రైయిల్ ఈవీఎంల మొదటి రాండమైజేషన్‌పై నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏడు నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గంకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి లాగ్ఇన్‌లో రాండమైజేషన్ తర్వాత రాజకీయ పార్టీల నాయకులు అంగీకారం తెలియజేయడంతో మళ్ళీ నియోజకవర్గాల వారీగా ఆర్ఓ లాగ్ఇన్‌కు వెళ్లడం జరుగుతుందని మళ్ళీ ఆర్ఓలు నియోజకవర్గంలో రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రాండమైజేషన్ నిర్వహించిన తర్వాత పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడుతాని తెలిపారు. మొదటి యాదృచ్ఛిక ఈవీఎంల జాబితా నియోజకవర్గాల వారీగా జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో భాగస్వామ్యం చేయబడుతుందని అన్నారు. ఒక నియోజకవర్గంకు రాండమైజేషన్ చేయవచ్చు అని, అన్ని నియోజకవర్గాలకు కూడా ఒకేసారిగా రాండమైజేషన్ చేయవచ్చునని తెలిపారు. రాండమైజేషన్ రాజకీయ పార్టీల నాయకులు అంగీకరించిన తర్వాత రాండమైజేషన్ అయిన కాపీలను అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలకు, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాకు 4708 బ్యాలెట్ యూనిట్లు, కంట్రో యూనిట్లు 4226, వివిప్యాడ్లు 5082 రావడం జరిగిందని తెలిపారు. సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాల్‌లో రాండమైజేషన్‌పై డిప్యూటీ తహాశీల్దార్లకు, ఈడియంలు ఎలక్షన్ డిటిలు, కంప్యూటర్ ఆపరేటర్లుకు ఈవీఎంలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు వెంకట శివ, భవాని, రాజకీయ నాయకులు బిజెపి నుంచి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నుంచి భాస్కర్, పరదేశి, సిపిఎం నుంచి వాడ గంగరాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి ఉదయ కుమార్, టిడిపి ప్రభుతేజ్, బిఎస్పీ నుంచి భాస్కర్, ఎలక్షన్స్ విభాగం సిబ్బంది ఉమాపతి, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవం



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండలం గుండ్లసాగరం పంచాయతీ పరిధిలో గాండ్ల కుల కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవ సభను రెస్కో అధ్యక్షులు సెంథిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు జిల్లా ఎంపీ రెడ్డప్ప, చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్, జిల్లా జడ్పీ అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. ముందుగా కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను మంత్రి పెద్దిరెడ్డి పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. అనంతరం సభా స్థలానికి చేరుకుని జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు కుల సంఘం పెద్దలు, వైసిపి నాయకులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కుప్పం శాసనసభ్యులుగా ఉన్న చంద్రబాబు నాయుడు చేయలేని పని నేడు జగన్మోహన్ రెడ్డి చేశారని అన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ భవన స్థల సాధన కోసం రెస్కో అధ్యక్షులు ఎంతగానో కృషి చేశారని ఆయనను అభినందించారు. అలాగే భవన నిర్మాణం కొరకు మూడు కోట్ల రూపాయల విధులను మంజూరు చేయనున్నట్టు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఎంపీ నిధుల నుండి 50 లక్షల రూపాయలు విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. గాండ్ల కులస్తుల చిరకాల వాంఛ నేడు నెరవేరిందని కావున గాండ్ల కులస్తులు ప్రతి ఒక్కరూ వైసీపీకి అండగా ఉండాలని కోరారు. రాబోవు ఎన్నికలలో గాండ్ల కులస్తులు ప్రతి ఒక్కరూ వైసీపీకి ఓటు వేసి కుప్పం నియోజకవర్గ శాసనసభ్యునిగా భరత్‌ను ఎన్నుకోవాలని సూచించారు.

సిఎం పర్యటనను విజయవంతం చేద్దాం: జెసి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ ఈనెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గ రామకుప్పం, శాంతిపురం పర్యటనను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ నుండి డిఆర్ఓ, బి.పుల్లయ్య, పిడిలు డ్వామా, డీఆర్డీఏ, రాజశేఖర్ తులసితో కలిసి ఈనెల 26న ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గం పర్యటనపై ఆర్డీఓలు, జడ్పీ సీఈఓ, వ్యవసాయ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహశీల్దార్లు, ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, ఏపీవోలు ఏపీఎంలతో రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనపై ఏర్పాట్లు పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ఈనెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గం, రామకుప్పం, శాంతిపురం మండల పర్యటనలో ఎలాంటి చిన్నపొరపాట్లు జరగకుండా అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. బహిరంగసభ వద్ద గ్యాలరీల ఇన్‌ఛార్జుల వారీగా కేటాయించిన గ్యాలరీల అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఐడి కార్డులు, గ్యాలరీలోకి అవసరమైన తాగునీరును సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మిప్రసన్న, జిల్లా వ్యవసాయ అధికారి మురళికృష్ణ, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, డీఈఓ దేవరాజులు, ఎస్ఎస్ ఏపిఓ వెంకటరమణారెడ్డి, తహశీల్దార్ సుశీల పాల్గొన్నారు.

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా డాక్టర్ వి.ఎం.థామస్

తెలుగు తమ్ముళ్లు సంబరాలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం డాక్టర్ వి.ఎం.థామస్‌ను చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ సందర్భంగా థామస్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ వెదురుకుప్ప అంబేద్కర్ కూడలిలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచి తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. అందరూ కష్టపడి థామస్ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్లస్టర్ ఇంచార్జ్ చెంగలరాయరెడ్డి, పార్లమెంటు కార్యదర్శి వెంకట రమణారెడ్డి, నియోజకవర్గ టిఎన్‌టిసి ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, మండల పార్టీ కార్యదర్శి వెంకటేష్, మండలం మాజీ పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నేడు 'మన ఇంటికి.. మన థామస్'

మండలంలోని కురివికుప్పం పంచాయతీలో 25వ తేదీ ఆదివారం మన ఇంటికి మన థామస్ కార్యక్రమం ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథ్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను పంచాయతీలోని ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ ముందుకు వెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నియోజవర్గంలో తెలుగు తమ్ముళ్లు కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమగ్ర భూసర్వే మహాయజ్ఞం: ఆర్కేరోజా



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: సమగ్ర భూసర్వే ఒక మహాయజ్ఞమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మండలంలోని పన్నూరు దళితవాడలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు , భూరక్షా పథకం హక్కు పత్రాలను పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భూ యజమానులకు శాశ్వత పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి 58 నెలల పాలనలో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. అవినీతి లేని రెవెన్యూ రికార్డులను అందించాలన్న లక్ష్యంతో ఈ సమగ్ర సర్వేను చేపట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,461 గ్రామాల్లో 1.07 కోట్ల రైతులు, 2.47 కోట్ల సర్వే నెంబర్లకు సంబంధించి 2.26 కోట్ల ఎకరాల వ్యవసాయ భూముల్లో సర్వే చేపట్టడం జరిగిందన్నారు. దీంతో పాటు 13,371 గ్రామ కమతాల్లో 85 లక్షల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు 123 పట్టణ ప్రాంతాల్లో 40 లక్షల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు సంబంధించి సర్వే చేస్తున్నారని అన్నారు. ఇలా సర్వేచేసి యాజమాన్య పత్రాలు జారీ చేయడం వందేళ్ల తరువాత జరుగుతోందన్నారు. భూ సంబందిత అన్నిశాఖల సమన్వయంతో ఈ సర్వే జరుగుతోందన్నారు. ఒక్క రూపాయి కూడా రైతు వద్ద తీసుకోకుండా హద్దు రాళ్లు నాటడం వరకు ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు.

డాక్టర్ సిఆర్ రెడ్డి 73వ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి (సిఆర్ రెడ్డి) స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి 73వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు నగరంలోని కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవన్ సమావేశ మందిరంలో జరిగిన కట్టమంచి రామలింగారెడ్డి 73 వ వర్ధంతి సభ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయమూర్తి కరుణకుమార్ మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ మొదటి వైస్‌ఛాన్సలర్‌గా పనిచేసిన సిఆర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు దేశవ్యాప్తంగా ఖ్యాతిని తీసుకువచ్చారన్నారు. ఆయన తెలుగు భాషపై అమితమైన ప్రేమ చూపే వారన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బహుమతులతో పాటు, ప్రశంసా పత్రాలను అందించారు. సభాధ్యక్షులు ప్రభాస్ కుమార్‌రెడ్డి, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ఆర్‌బిఎస్‌కె జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన బాబ్జి, నిర్వాహకులు ఎంవి శ్రీధర్ రెడ్డి, ప్రముఖ గణిత ఉపాధ్యాయుడు అరుణ్ శివప్రసాద్, పావుదేశి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్యామలమ్మ, ప్రముఖ రచయితలు రమేష్, మొగిలయ్యశెట్టి, సహదేవనాయుడు పాల్గొన్నారు.



ప్రముఖ గణిత అవధాని అరుణ శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నగరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటి జాబితాలో టీడీపీ నియోజకవర్గం ఇంచార్జి భాను ప్రకాష్ స్థానం సంపాదించారు. దీంతో నగరి ప్రజల నమ్మకానికి, ఆకాంక్షలకు, విశ్వాసానికి ప్రతిరూపం గాలి భాను ప్రకాష్‌కి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతులు తెలియజేశారు. నగరి బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి పెద్ద ఎత్తున బాణాసంచి పేల్చి, స్వీట్లు పంచి తమ ఆనందాన్ని హర్షాన్ని వ్యక్తం చేశారు.

బస్సు షెల్టర్లు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి అడ్రస్సు వైఎస్ఆర్‌సిపి పార్టీ అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శనివారం విజయపురం మండలం ఎల్లసముద్రం గ్రామానికి ఎంపీ నిధుల ద్వారా మంజూరైన అక్షరాల రూ.2.50 లక్షలతో నిర్మించిన నూతన బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. అలాగే పన్నూరు సబ్‌స్టేషన్ గ్రామానికి రూ.2.50లక్షలతో నిర్మించిన నూతన బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. గ్రామ ప్రజలు మంత్రికి గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.



గ్రూప్ 2 పరీక్షకు 1215 దరఖాస్తులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రాష్ట్ర మొత్తం జరగనున్న గ్రూప్-2 పరీక్షలకి బంగారుపాల్యం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, విజ్ఞాన్ డిగ్రీ కాలేజీ, ఎస్టి మేరీలలో పరీక్షా కేంద్రాలుగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సుభద్రమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్- 2 పరీక్షలకు 1215 మంది దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షల్లో ఎటువంటి అవంతరాలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని తెలిపారు. స్థానికంగా ఉండే జిరాక్స్ సెంటర్స్‌కి నోటీసులు పంపిణీ చేశామని, పరీక్ష ముగింపు వరకు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయం కంటే గంట ముందుగా హాజరుకావాలని పరీక్షలలో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదని, హాల్ టిక్కెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకుని రావాలని సూచించారు.

బూత్ లెవెల్ కార్యకర్తలతోనే అధికారం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బూత్ లెవెల్ కార్యకర్తలతోనే అధికారం అని పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి సునీల్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 80 శాతం పైన సంక్షేమ పథకాలు అమలు చేశామని ఇది గ్రామ వాలంటీర్లు, అధికారుల వల్ల సాధ్యమైందన్నారు. ఈ సంక్షేమ పథకాలు గురించి ప్రతి బూత్‌లో ఉన్న కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర పాలఎకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జడ్పిటిసి సోమశేఖర్, వైస్ఎంపీపీ శిరీష్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, సింగల్ విండో అధ్యక్షులు దత్తిరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలేశ్వర, సర్పంచులు భారతి, వాణిప్రియ, శ్రీహరి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్

పవన్ పొలిటికల్‌గా పనికిరాడు

మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : 'జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొలిటికల్ గా పనికిరాడు' అని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. తిరుపతిలో శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన 94 నియోజకవర్గాల్లో నారా లోకేష్ మంగళగిరి, బాలకష్ణకు హిందూపురం, చంద్రబాబు నాయుడుకు కుప్పం , టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడుకు టెక్కలి సొంత నియోజకవర్గం ప్రకటించారని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కనీసం సొంత నియోజకవర్గం ఇప్పటివరకు ఎంపిక చేసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా జనసేన అధినేత సొంతంగా ఆలోచించి తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను సంతోష పరచాలని సూచించారు. చంద్రబాబు నాయుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి అత్యధిక సీట్లు కైవసం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు నైజం తెలుసుకొని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన స్వప్రయోజనాలను పక్కనపెట్టి, తనను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు కృషి చేయాలని హితవు పలికారు.

వైభవంగా పౌర్ణమి గరుడసేవ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో శనివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.

గరుడ వాహనం - సర్వపాప ప్రాయశ్చిత్తం

పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. ఈకార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3కోట్లు

పెరిగిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు యాత్రికులు వివిధ ప్రాంతాల నుంచి తిరుమలకు చేరుకుంటున్నారు. యాత్రికుల రాక వల్ల 20 కంపార్టుమెంట్లు నిండిపోగా టోకెన్లు లేని యాత్రికులకు 15గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు. శనివారం స్వామివారిని 64వేల మంది యాత్రికులు దర్శించుకోగా 22 వేల మంది తలనీలాలు సమర్పించుకున్నారు. యాత్రికులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3 కోట్లు పైగా వచ్చిందని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలక మలుపు

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థుల జీవితాలకు ఇంటర్మీడియట్ ఓ కీలక మలుపు అని కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం గాయత్రీ అన్నారు. శనివారం పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు సరస్వతి పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవాలను మార్చే కీలకమైన మలుపు అని, ఇంటర్మీడియట్లో క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించినట్లయితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, ప్రతి ఒక్కరూ ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని పేర్కొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని రాజులకండ్రిగ గ్రామంలో వెలసి ఉన్న శ్రీకారేటి గంగమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, హోమం అభిషేకాలను బెంగళూరుకు చెందిన చిరంజీవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం వందమంది భక్తులకు అన్నదానం చేపట్టారు. పురుషోత్తం రాజు, జయచంద్రరాజు, మాధవరాజు, గోవిందస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవ స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని కుప్పనపల్లి గ్రామపొలిమేరల వద్ద వెలసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానంలో శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ఘనంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం అర్చకులు మురళీధరాచార్యులు శంకరశర్మ ఆధ్వర్యంలో కాలభైరవస్వామికి విశేష అభిషేకాలు సుగంధ పుష్పాలతో అలంకారాలు జరిపి ఉత్సవ విగ్రహాలకు కళ్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా గాయత్రి, సుభాష్, శారద, వన్యగౌడ, కృష్ణప్ప, రఘు గౌడు, భైరప్ప, వెంకటేష్, తిప్పన్న వ్యవహరించారు.

అన్నదానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన చక్రవర్తి, కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బంగారు పాల్యం: మాఘ పౌర్ణమి పురస్కరించు మండలంలోని మాధవనగర్ వద్ద బ్రహ్మానంద ఆశ్రమంలో శనివారం శ్రీ సత్యనారాయణ వ్రతకల్ప పూజా కార్యక్రమం నిర్వహించారు. మొదట సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి, రవీంద్ర ప్రసాద్, సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, పరదేశి రెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామంలోని గుట్టపై గల శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం వేడుకలను భక్తులు కన్నులపండువగా జరిగింది. శనివారం ఉదయం ఆలయంలో మూలవిరాట్‌లోని స్వామి, అమ్మవార్లకు విగ్రహాలకు అర్చకుల అభిషేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నరసింహారెడ్డి, సంపూర్ణమ్మ దంపతులు, సిద్దేశ్వర కొండ గ్రామానికి చెందిన దేవి, పరంధామ రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

మాజీ ఆర్మీ ఆఫీసర్ శైలేంద్రరావు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి విద్యార్థులకు ఉపయోగపడే పరికరాలను జెటిడి కోఆర్డినేటర్ ధనుంజయ, ఎస్ ఆర్మీ ఆఫీసర్ శైలేంద్రరావు అందిస్తామని తెలిపారు. శనివారం పాఠశాలలోని ఎన్‌సిసి విద్యార్థులకు తన ఆర్మీ జీవితం గురించి వివరించారు. చదువు, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం లాంగ్ జంప్ వంటివి డెమో చేసి చూపారు. అనంతరం వారి చేతుల మీదుగా ఎంఈవో సాయిలీల, హెచ్ఎం విశ్వనాథ్, ఏఎన్ఓ కె.యుగంధర్, చిరంజీవిలు పలువురు విద్యార్థులకు మోమెంటోలను అందించారు. మాజీ సైనికులు మోహన్‌బాబు, రమణ, తదితరలు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘనసన్మానం



ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వలంటీర్లు సమాజంలో చేస్తున్న సేవలకు గాను వారిని కుటుంబసభ్యులుగా భావిస్తూ ఎనలేని గౌరవాన్ని ప్రజలు అందజేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అమాస మోహన్ అన్నారు. శనివారం సోమల ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరం నందు మండలంలోని 250 మంది వాలంటీర్లను ప్రత్యేకంగా శాలువలతో సన్మానించి పలువురికి బహుమతులను అందజేశారు. వైస్ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీ సర్వేశ్వరమ్మ, సర్పంచులు వెంకటరమణ, రెడ్డప్ప, వనజమ్మ, రమణారెడ్డి పాల్గొన్నారు.

టేలర్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం పట్టణంలోని టేలర్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోనే మొట్టమొదటగా ప్రారంభమైన పాఠశాలగా టేలర్ హైస్కూల్ అని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకుంది. ప్రస్తుత పాఠశాల యాజమాన్యంతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:: PUTTUR
O.S.NO. 6/2017

Between:
N.Kanchana ...Plaintiff
AND
V.Subramanyam Naidu (died) and others ...Defendants

SUMMONS TODEFENDANT NO.6

TO
D6) Y.Indraja, D/o. Late Y. Jayaramudu, Chengamanaidukandriga H/w, Jagannadhapuram Post, Vijayapuram Mandal, Chittoor District.

Madam
Please take summons that theplaintiff filed the above suit against you and others for partition of the plaint schedule properties. The said suit was posted to 05.03.2024 for your apperance in the above suit. If you have got any objections you may appear on 05.03.2024 at 10.30 a.m. either in person or though your counsel and file your objections. In the event of your failure, the matter will be decided exparte.
Hearing 05.03.2024.

Sir K. Purushotham, M.A., B.L.,
Advocate for Plaintiff.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:: PUTTUR
O.F.P.No. 49/2014, O.S.NO. 46/2010

Between:
M.Munaswamy (Died) and others ...Decree Holders
AND
V.Munaswamy and Others ...Judgement Debtors

NOTICE TO JUDGEMENT DEBTORS 2 & 3

TO
1. P.Someswari (J.Dr. No.2), W/o. Hemachandra Kumar, D.No. 8-50, Rayapuram, Dhornakambala Cross Road, Chandragiri.
2. P.Balasaraswathi (J.Dr. No.3), W/o. P.Srinivasulu, D.No.3-64, Kapukandriga Village, Pullur Post, S.R.Puram Mandal, Chittoor District.

Madams,
Please take notice that the decree holders filed the above E.P. against judgment debtor no.1 for recovery of the E.P. amount by way of sale and you are added as judgment debtors 2 & 3 in the above E.P. The said E.P. is posted to 29-02-2024 for your appearance. If you have got any objections you may appear on 29-02-2024 at 10.30 A.M. either in person or through your counsel and file your objections. In the event of your failure, the matter will be decided exparte.

Sri K. PURUSHOTHAM, M.A., B.L.,
Advocates for decree holders,
PUTTUR.